క్లుప్తంగా

వేసవి సెలవుల్లో టీచర్లు అందుబాటులో ఉండాలి



ప్రత్తిపాడు: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు కచ్చితంగా ఫోన్‌కు అందుబాటులో ఉండాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి సూచించారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు బుధవారం పాఠశాల సామాజిక తనిఖీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణను ఎంఈఓ ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్‌లు రామచంద్రరావు, శ్రీనివాసరావు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఫైనల్ పరీక్షల మార్కులను సిద్ధం చేసి ప్రోగ్రెస్ రిపోర్టులు తయారు చేయాలన్నారు. సమ్మర్ హాలిడేస్‌లో ఫోన్లకు అందుబాటులో ఉండని ఉపాధ్యాయులకు మెమోలు ఇవ్వడం జరుగుతుందని హెచ్చరించారు.

పొన్నూరు టౌన్ చర్చి వైస్ ప్రెసిడెంటుగా యేసురత్నం



చేబ్రోలు: తూర్పు గుంటూరు సినడు 86న ప్రతినిధుల మహాసభ పొన్నూరు టౌన్ చర్చిలో బుధవారం నిర్వహించారు. ఈ మహాసభలో సినడు వైస్ ప్రెసిడెంటుగా చింతా యేసురత్నం, ఏఈఎస్‌సీ ఈసీ మెంబరుగా కొరివి రత్నబాయ్ కెనడీ ఎన్నికయ్యారు. బిషప్ కనపర్తి ఆశీర్వాదం, పి జయరాజు, ఏఈఎల్‌సీ సెక్రటరీ అక్కిదాసు జాషువా పాల్గొన్నారు.

రోజుకు 4 వేల మందికి పని కల్పించాలి

పెదనందిపాడు: ప్రతి రోజు కనీసం 4 వేల మందికి తగ్గకుండా ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.బాలమ్మ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బాలమ్మ మాట్లాడుతూ అడిగిన వారందరికి జాబ్ కార్డులివ్వాలని ఆమె సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయిలీల పాల్గొన్నారు.

తుమ్మలపాలెం యూపీ స్కూల్ హెచ్ఎంకు మెమో

ప్రత్తిపాడు: మండల పరిధిలోని తుమ్మలపాలెం అప్పర్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్‌ఈ రాజేశ్వరికి మెమో జారీ చేసినట్లు ఎంఈఓ సీహెచ్ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎంలకు పాఠశాలల సామాజిక తనిఖీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరవ్వడంతో పాటు, తన స్థానంలో మరో టీచర్‌ను పంపారు. దీంతో విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు గాను మండల విద్యావనరుల కార్యాలయం నుంచి మెమోను జారీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. ఈనెల 24వ తేదీన చేబ్రోలు మండలం శలపాడు గ్రామానికి చెందిన నవీన్‌కుమార్, ఉయ్యూరు మధు, బొడుగు రాకేష్, పంది నాగయ్య ద్విచక్రవాహనంపై గుంటూరు నుంచి తమ గ్రామానికి వెళుతుండగా బుడంపాడు వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొనటంతో నవీన్ ఘటన స్థలంలో మృతి చెందాడు. గాయపడ్డ ముగ్గురిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి స్థానికులు చేర్చగా చికిత్స పొందుతూ పంది నాగయ్య(27) బుధవారం మృతి చెందాడు.

హైవేపై కారు బోల్తా



ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. బుధవారం ఉదయం సమయంలో చిలకలూరిపేట వైపు నుంచి గుంటూరు వైపు వస్తున్న వేగంగా వస్తున్న కారు ప్రత్తిపాడు మండలం పార్వతీపురం సమీపంలోని పార్వతిదేవి అమ్మవారి దేవాలయం సమీపంలో టైర్ పంక్చర్ అవ్వడంతో సైడ్ మార్జిన్‌లో ఉన్న ఫెన్సింగ్ సిమెంట్ పోల్స్‌పైకి కారు దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. అయితే అదృష్టవశాత్తూ కారులోని బెలూన్లు ఓపెన్ అవ్వడంతో ఎవ్వరికీ ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయపడ్డారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిల హవా



కట్టా లావణ్య



వై.స్పందన



సాత్విక రెడ్డి

ప్రత్తిపాడు: ఇంటర్మీడియెట్ సెంకడియర్ ఫలితాల్లో ప్రత్తిపాడు అమ్మాయిలు అదరగొట్టారు. బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో 950కు పైగా మార్కులు సాధించారు. ప్రత్తిపాడుకు చెందిన కట్టా లావణ్య బైపీసీ గ్రూపులో 979 మార్కులు సాధించి సత్తా చాటగా, యాలమూరి స్పందన ఎంపీసీ గ్రూపులో 967 మార్కులు సాధించి జయకేతనం ఎగురవేసింది. అలానే బైపీసీ నుంచి బాపతు సాత్విక రెడ్డి 955 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు అత్యుత్తమ మార్కులతో రాణించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. లావణ్య శ్రీ చైతన్యలో చదువుతుండగా, స్పందన, సాత్వికలు ఎస్ఆర్ కళాశాలలో చదువుతున్నారు.

పెదనందిపాడు విద్యార్థులు..

పెదనందిపాడు: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో మొదటి సంవత్సరం 61 మందికి 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, ద్వితీయ సంవత్సరం 80 మందికి 33 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య తెలిపారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి హెమంత్ 843 మార్కులు సాధించారని, సీఈసీ విద్యార్థిని దేటా భవ్య 787 మార్కులు సాధించి కళాశాల మొదటి స్థానాల్లో ఉన్నట్లు ఆయన చెప్పారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



పొన్నూరులోని గృహాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ తదితరులు

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం రాబోయే రెండు నెలల్లో 40,728 గృహాల ప్రవేశాలు జరగాలనే దిశగా కృషి చేస్తున్నామని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. బుధవారం గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం, అడవితక్కెళ్ళపాడు గ్రామాల్లో నిర్మిస్తున్న టిడ్కో నివాసాలను ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న టిడ్కో హౌసింగ్ ప్రాజెక్టుల వివరాలను సంబంధిత కాంట్రాక్టింగ్ ఏజెన్సీతో, ఇంజినీరింగ్ సిబ్బందితో చర్చించారు. అడవితక్కెళ్ళపాడులో 4192, పొన్నూరులో 2,368, నరసరావుపేటలో 1504 మొత్తం కలిపి 8,064 డాక్టర్ వైఎస్సార్ జగనన్న నగర్, జి+త్రీ గృహ సముదాయాలను టిడ్కో ఇంజినీర్లు, మునిసిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. పూర్తిస్థాయి సదుపాయాలతో రాబోయే రెండు నెలల్లో లబ్ధిదారులకు అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఏ.పి.టిడ్కో ద్వారా నిర్మాణం చేపట్టిన అన్ని పురపాలక సంఘాలలో పర్యావరణం పరిరక్షించే విధముగా బయో ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తూ వన్ మిలియన్ మొక్కలు నాటి లబ్ధిదారులకు అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు చిన కోటేశ్వరరావు ప్రసాదరావు, వెంకటాద్రి పాల్గొన్నారు.

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఏపీ టిడ్కో గృహాలను టిడ్కో చైర్మన్ జమ్మాన్న ప్రసన్నకుమార్ బుధవారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర పనుల గురించి ఆరా తీశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.రాధ, టిడ్కో ఈసీ గేరా ప్రసాద్, మెప్మా పీడీ వెంకట నారాయణ ఉన్నారు.

జగనన్నతోనే ఇంటింటికీ సంక్షేమం



యనమదలలో జగనన్నే మా భవిష్యత్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: జగనన్నతోనే ఇంటింటికీ సంక్షేమం సాధ్యమని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల, నడింపాలెం గ్రామ పంచాయతీ చినకోండ్రుపాడు సచివాలయం-2 పరిధిలో బుధవారం రాత్రి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి జగనన్నే మానమ్మకం స్టిక్కర్లు అతికించారు. చంద్రబాబునాయుడు పాలనకు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాలను గడపగడపకు తిరిగి వివరించారు. కార్యక్రమాల్లో యనమదల సచివాలయ కన్వీనర్లు రాంబాబు, సంతోషమ్మ, నడింపాలెం సొసైటీ ప్రెసిడెంట్ గింజుపల్లి సుబ్బారావు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ కట్టా సుబ్బారావు, వాసిమళ్ల అమృతయ్య పాల్గొన్నారు.

పెదకాకాని: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. పెదకాకాని మండలంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగిస్తున్నారు. మండలంలోని ఉప్పలపాడు, పెదకాకాని, తక్కెళ్ళపాడు గ్రామాలలో బుధవారం ప్రతి ఇంటికీ వెళ్ళి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్, అబ్దుల్ షరీఫ్, నాగుల్ షరీఫ్, గౌస్ బాషా, మీరాబి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రత్తిపాడు: విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం తలపెట్టిన ప్రచారభేరి కార్యక్రమాన్ని బుధవారం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించారు. మండలశాఖ కార్యదర్శి కె.ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి రామారావు స్థానిక పెట్రోల్ బంకు వద్ద ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏపీకి మోదీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం మాటల్లో చెప్పలేనిదన్నారు. ఇక టీడీపీ కూడా బీజేపీని నిలదీయలేని దుస్థితిలో ఉందన్నారు. అందుచేత ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, బి లక్ష్మణరావు, బొమ్మగంటి రామారావు, డి రమేష్‌బాబు, శ్రీనివాసరావు, సీహెచ్ పరిమి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేబీఎంకు పూర్వవైభవం తెస్తాం

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



సూచనలిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: ఏటీ అగ్రహారంలోని ఎస్.కె.బి.ఎం హైస్కూలుకు పూర్వ వైభవం తేవడమే తన లక్ష్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం హైస్కూలులో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులల్లో భాగంగా శ్లాబు వేసే కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, మిర్చి యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అడకా పద్మావతి, కార్పొరేషన్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ముందుగా పాఠశాలలో జరుగుతున్న పనుల తీరుతెన్నులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన సైట్ ప్లాన్, మార్కింగ్‌కు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా.. లేదా అనేది పరిశీలించారు. పాఠశాల అవసరాలు, పూర్వ విద్యార్థులుగా తమ ఆకాంక్షలకు తగినట్లుగా లేని కొన్ని పనులపై అభ్యంతరం తెలిపారు. తాము ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో తప్పనిసరిగా పనులు చేపట్టే విషయంలో తమను సంప్రదించాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నాటికి అన్ని పనులు పూర్తి కావాలని సూచించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఎస్‌కేబీఎంలో జీ ప్లస్ టు కేటగిరి కింద 14 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ రాష్ట్రంలో అందరూ విద్యావంతులు కావాలన్న సమోన్నత ఆశయంతో సీఎం జగన్ విద్యారంగంపై విశేషంగా దృష్టి సారించారని, సంపూర్ణ అక్షరాశ్యతే లక్ష్యంగా పలు ప్రత్యేక పథకాలతో విద్యా వ్యవస్థ రూపురేఖలు సమూలంగా మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పాలపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్, కాంద్రగుంట గురవయ్య, పార్టీ నాయకులు అంగడి శ్రీనివాసరావు, దేవరశెట్టి రాంబాబు, లక్ష్మణ, సురసాని వెంకటరెడ్డి, అడకా వేణు, కోలా సునీల్, మామిడి కిషోర్, ఆనంద్, సుభాని, సింగు నరసింహరావు, షేక్ నబీబా బాజీ, ఖైరూన్, ఖాసిం, సైదా, అబ్రహం, నాగయ్య, ఈఈ సుందరరామిరెడ్డి, ఏడీఈ రమేష్ పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు



పెరవలి(వేమూరు): త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో వేడుకలు బుధవారం నిర్వహించారు. జయంతి వేడుకల్లో సంగీత అకాడమి నాట్య శిరోమణి మంజు భార్గవి, డాక్టరు తాడేపల్లి లోక్‌నాథ్ శర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లాది సూరిబాబు, గ్రామ సర్పంచి దాది లక్ష్మీరాజ్యం, దాది సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదనందిపాడు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కె.వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామ సమస్యలను పరిష్కరించాలి

బోడిపాలెం(కాకుమాను): గ్రామ సమస్యలను పరిష్కరించే విధంగా సర్పంచి,కార్యదర్శులు సమన్వయంగా పని చేయాలని తెనాలి డీఎల్‌పీఓ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బోడిపాలెంలో గత కొద్ది రోజుల నుంచి ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని దీనికి కారణం సర్పంచి అందుబాటులో లేకపోవడమే అంటూ గత సోమవారం స్పందన కార్యక్రమంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తెనాలి డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు.

సంగీత నృత్య అకాడమీ సభ్యురాలిగా విజయలక్ష్మి



పాతగుంటూరు: ఆంధ్రప్రదేశ్ సంగీత నృత్య అకాడమీ సభ్యురాలిగా గుంటూరుకు చెందిన మేరిగ విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ నుంచి నియామక ఉత్తర్వులు పొందారు. రెండు సంవత్సరాలు ఈ పదవిలో విజయలక్ష్మి కొనసాగనున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

థలసేమియా చిన్నారుల కోసం...



గుంటూరు మెడికల్: థలసేమియా చిన్నారులకు రక్తదానం చేసేవారి వద్ద నుంచి రక్తాన్ని సేకరించేందుకు నీడ్స్ తలసేమియా కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత సంచార రక్తనిధి వాహనాన్ని ప్రారంభిస్తున్నామని నీడ్స్ సొసైటీ అధ్యక్షుడు గూడూరు శ్రీధర్ చెప్పారు. బుధవారం స్థానిక కాకాని రోడ్డులోని నీడ్స్ తలసేమియా కేర్ సెంటర్‌లో తలసేమియా చిన్నారుల సహాయార్థం ఉచిత రక్తనిధి సంచార వాహనాన్ని శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీడ్స్ సొసైటీని 2008లో ప్రారంభించామని, ఇప్పటి వరకు పదివేల మంది తలసేమియా చిన్నారులకు ఉచితంగా రక్తదానం చేయడంతో పాటు, రక్తమార్పిడి సేవ లు కూడా ఉచితంగా అందించామన్నారు. రక్తనిధి సంచార వాహనం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రక్తాన్ని సేకరిస్తోందని, ఆ రక్తాన్ని వ్యాధి సోకిన చిన్నారులకు ఉచితంగా అందిస్తుందని వెల్లడించారు. తలసేమియా చిన్నారులకు ప్రతినెలా 200 యూనిట్ల రక్తం అవసరమని చెప్పారు. అందుకోసం సంచార రక్తనిధి వాహనాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా రక్తదానంపై అవగాహన కల్పించి రక్తాని సేకరిస్తామన్నారు. ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా తలసేమియా చిన్నారుల ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. కార్యక్రమంలో శివాజీ యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోపూరి భాస్కర్ నాయుడు, నీడ్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ముప్ప రాజు శ్రీనివాసరావు, రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ యడ్లపల్లి సందీప్, పెథాలజిస్ట్ డాక్టర్ మణికంఠ, డాక్టర్ చదలవాడ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘల్లు.. ఘల్లుమంటూ..!



మిట్టపల్లి శ్రీవాణి



పిల్లి దుర్గారావు

పాత గుంటూరు: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో మహా మంజీర నాదం పేరున నృత్యోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం కార్యక్రమాలకు ఆలయ కార్యదర్శి బోర్ర ఉమామహేశ్వర రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాకినాడకు చెందిన పిల్లి దుర్గారావు, వరంగల్‌కు చెందిన మిట్టపల్లి శ్రీ వాణి, విజయవాడకు చెందిన లంక నాగ సుస్మిత నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. వీరిని యువ కళా రత్న పురస్కారంతో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం సత్కరించారు.

వంద రోజుల పని దినాలే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ బాలమ్మ

కాకుమాను: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు వంద రోజులు పని కల్పించే విధంగా సిబ్బంది కృషి చేయాలని ఏపీడీ బాలమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజులు పని కల్పించాలని, గ్రామాలలో జాబ్ కార్డులు లేని ఎస్సీ, ఎస్టీలను గుర్తించి వెంటనే వారికి కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. పంట పొలాల్లో వివిధ రకాల పండ్ల సాగు చేసుకునే రైతులను గుర్తించి వారి వివరాలను సేకరించాలని పేర్కొన్నారు. గ్రామాలలో చెరువుకట్టలపై కొబ్బరి చెట్లు నాటేందుకు ఆసక్తి ఉన్న వారిని గుర్తించి వారికి మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. గతేడాది గ్రామాలలో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లదేనని చెప్పారు. విధుల నిర్వహణలో ఎవరైన అశ్రద్ధ వహిస్తే అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.శరత్ బాబు, ఏపీఓ శింగారావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై మీకు బాధ్యత లేదా!

సెక్రటరీలపై జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి ఆగ్రహం

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే, క్షేత్ర స్థాయిలో సెక్రటరీలు మాత్రం పట్టీ పట్టనట్లు ఉంటున్నారని డీపీఓ కేశవరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డీపీఓ జగనన్న హౌసింగ్ నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారీగా సమీక్షిస్తున్న సమయంలో కొందరు కార్యదర్శులు గృహ నిర్మాణాల్లో పురోగతి లేకపోవడంపై పొంతనలేని సమాధానాలు చెప్పడంతో డీపీఓ అసహనం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలపై మీకు బాధ్యత లేదా అంటూ ఆగ్రహించారు. కచ్చితంగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిందేనని ఆదేశించారు.

- పన్నుల వసూళ్లలోనూ ప్రత్తిపాడు గ్రామ పంచాయతీతో పాటు మరికొన్ని పంచాయతీలు వెనుకంజలో ఉన్నాయన్నారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు పన్నుల వసూళ్లలో ప్రగతి చూపకపోతే ఉపేక్షించేది లేదన్నారు. ఇకపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.
- తొలుత రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఆరోగ్యకర పంచాయతీగా అవార్డు అందుకున్న నడింపాలెం గ్రామ సర్పంచి లాం రత్నకుమార్‌ను డీపీవో, ఎంపీడీవోలు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

కార్యదర్శులందరికీ షోకాజ్ నోటీసులు..

మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరికీ షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీరమ్య తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రగతి, అప్‌డేట్స్‌పై ఎప్పటికప్పుడు అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో వాయిస్ రికార్డులు, సందేశాలు పంపుతున్నా.. ఏ ఒక్క సెక్రటరీ స్పందించడం లేదని, ఆయా పథకాల అమలులో క్షేత్ర స్థాయిలో పురోగతి కూడా కనిపించడం లేదన్నారు. ఉద్యోగాన్ని ఆషామాషీగా తీసుకుంటున్న వారందరికీ షోకాజ్‌లు ఇవ్వనున్నట్లు సభా వేదికపై స్పష్టం చేశారు. సమావేశంలో ఈఓపీఆర్డీ మావులూరి మోషె, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: మండలంలోని గ్రామాలలో నాడు-నేడు ఫేజ్-2 కింద జరుగుతున్న పాఠశాల అభివృద్ధి పనులను పేరెంట్స్ కమిటీల ద్వారా సామాజిక తనిఖీ చేయించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలతో నాడు-నేడు పనులపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పాఠశాలల్లో విద్యార్థులకు కావల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నాడు-నేడు పనుల్లో పేరెంట్స్ కమిటీ సభ్యులను భాగస్వాములను చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రీసోర్స్ పర్సన్ ఏడుకొండలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గుంటూరు సాధనకు కృషి చేద్దాం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరు ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో ప్రజారోగ్య విభాగ, ఇంజినీరింగ్ అధికారులు, శానిటేషన్ కార్యదర్శులతో నగరంలో పారిశుద్ధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, ట్రేడ్ లైసెన్స్‌లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలని, కార్మికులు, శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మరింత బాధ్యతగా పిన్ పాయింట్ ప్రకారం విధులు నిర్వహిస్తే స్వచ్ఛ సర్వేక్షణ్ లో నగరానికి మెరుగైన ర్యాంక్ రావడం పెద్ద కష్టం కాదన్నారు. క్షేత్ర స్థాయిలో విధుల్లో కొందరు అంకిత భావంతో పని చేస్తున్నప్పటికీ, మరి కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని. అటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రతి షాప్ ముందు డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, వ్యర్థాలను రోడ్లపై, కాల్వల్లో వేసే షాప్స్ సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రధాన రోడ్లను శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా కార్మికులను కేటాయించాలని, రోడ్ల వెంబడి కాల్వలు ఫ్రీ ఫ్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి వ్యాపారుల నుండి చెత్త సేకరణకు ప్రత్యేక సమయం కేటాయించాలని, రోడ్ల మీద వ్యర్థాలు వేసే వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. కమర్షియల్ సంస్థల నుంచి వ్యర్థాలు సేకరించే కాంట్రాక్టర్లు ప్రతి రోజు సేకరణ చేస్తుంది, లేనిది పరిశీలించాలన్నారు. నిర్మాణాలు జరుగుతున్న భవనాలకు ప్లానింగ్ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి కార్యదర్శి ప్రజలకు హోం కంపోస్ట్ తయారీ ప్రాధాన్యత, తయారీ విధానంపై అవగాహన కల్గించాలని, అలాగే అపార్ట్మెంట్లలో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ చేసే సమయంలోనే ఆర్.ఎఫ్.ఐ.డి. ట్యాగ్ లను స్కాన్ చేయాలని, స్కానర్లు మరమ్మతు ఉంటే వెంటనే చేయించాలన్నారు. ఎస్.ఐ.డివిజన్ల వారిగా రూట్ మ్యాప్ ప్రకారం చెత్త తరలింపుకు వాహనాలు వచ్చేలా వెహికిల్ షెడ్ అధికారులు చూడాలని, ఎక్కడైనా సమస్య ఏర్పడితే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్, ప్లానింగ్ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి, భవన నిర్మాణ వ్యర్థాలు, గ్రీన్ మ్యాట్ ల ఏర్పాటు ఇతర సంయుక్త సమస్యలపై సమన్వయం చేసుకోవాలన్నారు.

2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరం మెరుగైన ర్యాంక్ సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారం, ఎండార్స్‌మెంట్ ఇవ్వడం పై కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి కమర్షియల్ సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రేడ్ లైసెన్స్ నూతనంగా మంజూరు చేసేప్పుడు సదరు సంస్థ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు చెల్లించి ఉంటేనే దరఖాస్తు ప్రాసెస్ చేయాలని శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. పన్ను వివరాల కోసం సంబంధిత వార్డ్ అడ్మిన్ కార్యదర్శితో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో తొలుత ఇటీవల మృతిచెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొలాకి నివాళి అర్పించిన కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మరీ ముఖ్యంగా ప్రజారోగ్య విభాగ సిబ్బంది ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్, ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ. కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, ఏఈ దుర్గా ప్రసాద్, బయాలజిస్ట్ మధుకుమార్, యస్.యస్.లు రాంబాబు, ఆనందకుమార్, ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.